క్లుప్తంగా

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



అమ్మవారిని దర్శించుకుంటున్న దాతలు

బనగానపల్లె రూరల్: టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణానికి గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామానికి చెందిన కాటంరెడ్డి లక్ష్మీదేవి, ఆమె కుమారులు జగదీశ్వరరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. సోమవారం సంస్థ నిర్వాహకుడు రామగంగిరెడ్డికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు వాసంతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పట్టాభిరామాలయ పనులు



జోరుగా సాగుతున్న నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మిస్తున్న పట్టాభిరామాలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సోమవారం గర్భగుడి ముందు భాగంలోని మండపం పైభాగంలో స్లాబ్ పను లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది వరకే గర్భగుడి పూర్తి చేసి స్వామి విగ్రహ ప్రతిష్ట చేశామన్నారు. మండపంతో పాటు ఇతర నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతున్నా మని పేర్కొన్నారు. వచ్చే శ్రీరామనవమి నాటి కి అన్ని పనులు పూర్తి చేసి స్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. నలుగురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం రెడ్డిపల్లెకు చెందిన సుభాష్‌రెడ్డి భార్య సునీత, కుమారులు యుగంధర్‌రెడ్డి, మణివర్ధన్‌రెడ్డితో కలిసి బైక్‌పై నంద్యాలకు వెళుతున్నారు. కోవెలకుంట్ల మండలం కలుగొట్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కింద పడి గాయాలపాలయ్యారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయడంతో సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కేజీబీవీల్లో సీట్ల సంఖ్య పెంచాలి

ప్యాపిలి: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలికలను చదివించాలంటే పేద తల్లిదండ్రులకు భారంగా మారిందన్నారు. ఆర్థిక స్తోమత లేని కారణంగా పేదలు తమ కుమార్తెలను ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివించలేని పరిస్థితి నెలకొందన్నారు. కేజీబీవీల్లో తరగతికి 40 సీట్లు మాత్రమే కేటాయించడంతో దరఖాస్తు చేసుకున్న విద్యార్థినుల్లో చాలా మందికి సీట్లు దక్కడం లేదన్నారు. కేజీబీవీలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వం సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు.

ఆరుగురికి ప్రతిభా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని షేక్ తస్రీన్

డోన్ టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన డోన్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. పట్టణానికి చెందిన కమ్మరి విజయదుర్గాప్రసాద్, కుంద రుషిక, కెంచె జోత్స్న, జలవాడి వాణిజయలక్ష్మీ, షేక్ తస్రీన్, విజయసింగ్ మీనా సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఉయ్యాలవాడ మండలం ఇంజేడుకు చెందిన బాలుడు డబ్లు గోవిందిన్నె వైపు నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆటోలో నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి!

- వలంటీర్ సేవలను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతల హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం
- రోడ్డున పడ్డ నిరుద్యోగులు
- నమ్మి మోసపోయామని ఆవేదన
- ప్రజలకు దూరమైన సేవలు



ప్యాపిలి మండలం మాధవరం సచివాలయం

పైరవీలకు తావులేకుండా ఐదేళ్ల పాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రశంసలందుకున్న వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది. గత ఏడాది ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని.. వారి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఊరూవాడా హోరెత్తించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడారు. ప్రభుత్వ చర్యతో వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నమ్మి మోసపోయామని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డోన్ టీఆర్ నగర్‌లో వేకువజామునే పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్),



వలంటీర్లకు వందనం కింద ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన (ఫైల్)

డోన్: ప్రజలకు ఇంటి ముంగిటకే సేవలందించాలన్న గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో 50 మందికి ఒక వలంటీర్‌ను నియమించి సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసింది. దేశంలోనే మొదటి సారి ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి మన్ననలు అందుకుంది. అలాంటి వ్యవస్థను రాజకీయ అక్కసులో కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది.

సేవకులు

2014–2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రచ్చబండలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వీటికి పరిష్కారం చూపాలని 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేయడమే కాకుండా వలంటీర్లను నియమించి తెల్లారక ముందే పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు పంపి పింఛన్ మొత్తం ఇప్పించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. వృద్ధులు అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చేరితే వలంటీర్లు నేరుగా అక్కడికే వెళ్లి పింఛన్‌ను అందజేసేశారు. తుఫాన్, వరదలు లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రేషన్‌ను అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు.

నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు విజయవంతంగా కొనసాగిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా పేద నిరుద్యోగ యువత పెద్దఎత్తున ఉపాధి పొందారు. అప్పట్లో 20–25 ఏళ్ల మధ్య వయస్సు వారు 27 శాతం మంది, 26–30 ఏళ్ల మధ్య వారు 36 శాతం, 31–35 ఏళ్ల మధ్య వారు 28 శాతం కలిపి మొత్తం 91 శాతం మంది 35 ఏళ్ల లోపు వారే వలంటీర్ గా ఉపాధి పొందారు.

డోన్ నియోజకవర్గంలో సచివాలయాలు, వలంటీర్ల వివరాలు

మండలం	సచివాలయాలు	వలంటీర్లు (గతంలో)
డోన్	36	621
ప్యాపిలి	23	363
బేతంచెర్ల	21	462
మొత్తం	80	1446

నాడు ప్రోత్సాహకాలు

కేవలం రూ.5 వేల గౌరవ వేతనంతో అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లలో సేవాదృక్పథాన్ని మరింత పెంపొందించేందుకు వారికి గత ప్రభుత్వం నగదు పురస్కారాలను ప్రకటించేది. సేవా వజ్ర కింద రూ.45 వేలు, సేవారత్న కింద రూ.30 వేలు, సేవామిత్ర కింద రూ.15 వేలను ఏటా వలంటీర్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేసింది.

నమ్మించి .. నట్టేట ముంచారు

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పన్నిన కుట్రలో భాగంగా అధికారంలోకి వచ్చిన అనంతరం కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీ పైనే నెట్టడం దుర్మార్గం. వలంటీర్ల ఓట్లతో పాటు వారి ద్వారా లభించే ఓట్లు గంపగుత్తగా వైఎస్సార్‌సీపీకి పడకూడదనే దురుద్దేశంతో వలంటీర్ల వేతనాలు పెంచడంతో పాటు వ్యవస్థను కొనసాగిస్తామని నమ్మించి అధికారంలోకి రాగానే వారిని నట్టేట ముంచారు.

అబద్ధపు హామీలతో ముంచారు



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రెట్టింపు వేతం ఇస్తామని ఆశపెట్టారు. వారి మాటలు నమ్మి సంతోషించాం. తీరా అధికారంలోకి వచ్చీరాగానే మమ్మల్ని రోడ్డున పడేశారు. అబద్ధపు హామీలతో నిట్టనిలువునా ముంచి నమ్మకద్రోహం చేసిన కూటమి నేతలను జాతి ఎన్నటికీ క్షమించదు.

–గోపాల్, మాజీ వలంటీర్, గూటుపల్లి, బేతంచెర్ల

సిగ్గులేని ప్రభుత్వం



ఎన్నికల ముందు నిస్సిగ్గుగా మా ఓట్ల కోసం వెంపర్లాడి ఎన్నికల అనంతరం అధికారం చేపట్టగానే వలంటీర్ల వ్యవస్థను గత ప్రభుత్వమే రద్దుచేసిందని, ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టడం దుర్మార్గం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులను వలంటీర్లతో పాటు వారిద్వారా సేవలందుకున్న ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఉంది.

–రవికుమార్, మాజీ వలంటీర్, ఎద్దులపెంట, డోన్

పొట్టకొట్టడం అన్యాయం



కూటమి ప్రభుత్వం జాతికి గర్వకారణమైన వలంటీర్ వ్యవస్థను రద్దుచేయడం హేయమైన చర్య. కేవలం మాజీ సీఎంకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో వ్యవస్థను రద్దు చేసి ప్రజల వద్దకు పాలన చేరకుండా అడ్డుకున్నామని సంబరపడుతున్నారు. దీని వల్ల ప్రజలు కూటమి నాయకుల చర్యలను యావగించుకుంటున్నారు.

–రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ, డోన్

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, పల్లకీ సేవను నిర్వహించారు. ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి సంప్రదాయ బద్ధంగా పల్లకీ సేవను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులకు సూచనలు చేస్తున్న కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీప్రియ

బనగానపల్లె రూరల్: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త లక్ష్మీప్రియ అన్నారు. సోమవారం మండలంలోని పసుపల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించడం వల్ల అనే ప్రయోజనాలు ఉన్నాయని, పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని తెలిపారు. అలాగే పంట అవశేషాలు, సుస్థిర యాజమాన్యం, వేసవి దుక్కులు–ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఎంపీఈఓ చామంతి, మల్లేశ్వరి, వీపీఏ కల్పన పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతు సంఘం మండల కన్వీనర్ పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులతో కలిసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5లక్షల వరకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంక్షేమం కోసం నూతన కౌలు చట్టం తీసుకొస్తామని చెప్పి ఏడాది పూర్తయినా వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. రైతు సంఘం నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, పెద్దయ్య, హరికృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ఎంఈసీ విద్యార్థిని గరుడ జమీమా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మీ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 962 మార్కులు సాధించడంతో సోమవారం నంద్యాలలో జరిగిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో అవార్డు, రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు చెప్పారు.

స్వయం ఉపాధి ఉత్తమ మార్గం

డోన్: ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డోన్ అయ్యప్పస్వామి దేవాలయం వద్ద వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ ఆర్జే రమణ ఏర్పాటు చేసిన అమ్మ న్యూట్రిషన్ సెంటర్‌ను సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి





డోన్, బేతంచెర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

డోన్ టౌన్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుని ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 5 వేల మంది కంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ డోన్ మండల, పట్టణ కార్యదర్శులు నక్కిశ్రీకాంత్, శివరామ్, అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ కోసం 32 మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల రాజీనామాతో పాటు 26 వేల ఎకరాల భూమిని ఇచ్చిన రైతుల త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని భావిస్తుండడం సరికాదన్నారు.

–బేతంచెర్ల: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి




విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న సాక్షి టీవీ డిబేట్‌లో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు మహిళలపై చేసిన వ్యాఖ్యలను అప్పుడే కొమ్మినేని ఖండించారని తెలిపారు. కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఉద్దేశ పూర్వకంగా వైఎస్సార్‌సీపీకి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదిస్తూ కూటమి నాయకులు విషప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ అనుకూల చానల్స్‌లో జర్నలిస్టులు కృష్ణమోహన్, మూర్తి, సాంబశివరావు డిబేట్లలో పలుమార్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, నాయకులపై దిగజారి మాట్లాడారని గుర్తు చేశారు. రోజా సహా ఇతర మహిళా నాయకులపై అసభ్యకరంగా మాట్లాడారని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని దుయ్యబట్టారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. కూటమి ఏడాది పాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల దృష్టి మళ్లించడానికి నానాప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కృష్ణంరాజు వ్యాఖ్యలను వంకగా పెట్టుకుని విషరాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఇందులో సీఎం చంద్రబాబుకు కొమ్ముకాస్తున్న మీడియా సంస్థలు కూడా పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు సమర్థనీయంకాదని ఇప్పటికే వైఎస్సార్‌సీపీ స్పష్టం చేసిందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ బనగాపల్లె, కోవెలకుంట్ల మండల కన్వీనర్లు జనార్దన్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రైతు, అంగన్‌వాడీ విభాగాల అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతో సుపరిపాలన

బేతంచెర్ల: దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందిస్తున్నారని బీజేపీ నంద్యాల జిల్లా కార్యదర్శి శివకృష్ణ, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాగమోహన్ అన్నారు. ప్రధాని మోదీ పాలనకు సోమవారంతో 11 ఏళ్లు పూర్తి కావడంతో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామ మందిర నిర్మాణం వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. బీజేపీ నాయకులు రవిశంకర్, మారం విష్ణు, హరికృష్ణ, రాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాగంటిపల్లెలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఈ నెల 10,11వ తేదీల్లో పెద్దమ్మ దేవర జరగనున్న నేపథ్యంలో గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ గ్రామంలో పర్యటించి డ్రైనేజీ కాల్వలు, మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేయించారు.

స్కూల్ బస్సులను తనిఖీ చేయాలని వినతి

డోన్ టౌన్: విద్యార్థులను తరలించే ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు, వ్యాన్లను తనిఖీ చేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ బస్సులను తనిఖీ చేయాలని కోరారు. వెంకటేష్, జయరామ్, రవికుమార్ ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్యాపిలి: ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



అవుకులో..



డోన్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

ప్యాపిలి: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యోగా మనిషిని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచుతుందన్నారు. మానసిక ఒత్తిడిని జయించడం యోగాతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నవీన పాటి, లెక్చరర్లు సత్యబాబు, నవీన్, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి, ముస్తాక్, శంకరయ్య, మంజునాథ్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ఎంపీడీఓ వెంగన్న వివరించారు. యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అవుకు బస్టాండ్, మార్కెట్, సెంటర్, తేరువీధుల మీదుగా ర్యాలీ సాగింది. ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, ఈఓ హరిప్రసాద్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డోన్: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, గీతాయోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవని పేర్కొన్నారు.

బేతంచెర్ల: ఈనెల 21వ తేదీ జరగనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ కోరారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు తస్లిమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



బేతంచెర్ల రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సీపీఐ, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్ టౌన్/బేతంచెర్ల: కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని డోన్, బేతంచెర్లలో సీపీఐ, వైఎస్సార్‌సీపీ, కార్మిక సంఘాల నాయకులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కర్నూలు నుంచి గుంటూరుకు, హుబ్లీ నుంచి విజయవాడకు గతంలో ఉన్న ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి మోటా రాముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, సీపీఐ బేతంచెర్ల మండల కార్యదర్శి భార్గవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాకీరుల్లా బేగ్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.